



# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జూన్ 26, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ..
### ఈసారి 69 అడుగుల రూపం!

పంచముఖ సంకటహర గణపతిగా దర్శనమివ్వనున్న వినాయకుడు

ఇరువైపులా సోమనాథ్, కాళికామాత రూపాలు

పర్యావరణ హితంగా మట్టితో భారీ విగ్రహం నిర్మాణం



## రిటైర్మెంట్ తర్వాత సీఎస్‌కు కీలక పదవి.. 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా నియామకం?

తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం

## లంచం కేసులో చిక్కిన తహసీల్దార్ రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!





## 'ప్రజల తీర్పే కాంగ్రెస్‌కు గుణపాఠం'

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల వెల్లువ

'హామీలు అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా' అంటూ సీఎంకు సవాల్

అప్పులు, అభివృద్ధి, స్థిరాస్తి రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న భారాస నేత

కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ద పార్టీని బలోపేతం చేయాలని పిలుపు

2028లో మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ధీమా

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి కంటే రాజకీయ వ్యవహారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ, ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. చేవెళ్లలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం స్పష్టత చూపాలని కేటీఆర్

(మిగతా 2వ పేజీలో)

# జలసంరక్షణకు జననేతల సంకల్పం

**తుంగభద్ర డ్యాం నూతన గేట్లను ప్రారంభించిన కేంద్రమంత్రి, 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు**

జల వివాదాల పరిష్కారానికి కేంద్రం నేతృత్వంలో శాశ్వత వ్యవస్థ అవసరమన్న రేవంత్‌రెడ్డి

నదుల అనుసంధానమే దేశ భవిష్యత్తుకు మార్గమని చంద్రబాబు ప్రతిపాదన

రైతుల ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేశామని డీకే శివకుమార్

పూడికతీత, జల సంరక్షణ, పరస్పర సహకారంతో మూడు రాష్ట్రాలకు కొత్త దిశ




బెంగళూరు: దక్షిణ భారత వ్యవసాయానికి జీవనాధారంగా నిలిచిన తుంగభద్ర జలాశయం కొత్త అధ్యాయానికి నాంది పలికింది. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత డ్యాంలో అమర్చిన 33 నూతన స్పిల్‌వే గేట్లను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై నిలబడి జల సంరక్షణ, నీటి వినియోగం, పరస్పర సహకారంపై స్పష్టమైన సందేశం ఇవ్వడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. రైతుల సంక్షేమం, సాగునీటి భద్రత, భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాలు రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కర్ణాటకలోని హొసపేట సమీప తుంగభద్ర ఆనకట్ట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నూతన గేట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జలాశయాల్లో పేరుకుపోతున్న పూడిక కారణంగా భారీ స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని, తుంగభద్రలో కూడా సంయుక్తంగా పూడికతీత చేపట్టాలని సూచించారు. మూడు రాష్ట్రాలు గేట్ల పునరుద్ధరణలో ప్రదర్శించిన సమన్వయాన్ని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తే నీటి వినియోగ సామర్థ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానమే దేశ జల భద్రతకు శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. గోదావరి--కావేరి అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలు సమర్థవంతంగా తీరుతాయని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య నీటి వివాదాల కంటే నీటి వినియోగమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. ప్రకృతి విపత్తులు, వరదలు, కరవు పరిస్థితులను ఎదుర్కోవాలంటే జలవనరుల సమగ్ర నిర్వహణ అవసరమని చెప్పారు. గతంలో తుంగభద్ర గేటు దెబ్బతిన్న సమయంలో చేపట్టిన మరమ్మతులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం అన్ని గేట్ల పునరుద్ధరణ పూర్తి కావడం

(మిగతా 2వ పేజీలో)



## ఉద్యోగులే నా బలం

ఉచిత ప్రమాద బీమాతో ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా

'గుంపు మేస్త్రీ' వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర స్పందన

పీఆర్సీపై త్వరలో నిర్ణయం.. అదనపు పని గంటతో ఆదాయం పెంచాలని పిలుపు

ప్రజల కోసం పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ

అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, ప్రతిపక్షాల విమర్శలపై ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఉద్యోగుల కోసం ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ యంత్రాంగమే రాష్ట్రాభివృద్ధికి ప్రధాన బలమని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తారని, వారి భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ బ్యాంకులతో అవగాహన ఒప్పందాల అనంతరం ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇటీవల తనపై వచ్చిన 'గుంపు మేస్త్రీ' వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తాను ఆ వ్యాఖ్యను అవమానంగా భావించడం లేదని సీఎం చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ తన బృందమని, వారికి తానే

(మిగతా 2వ పేజీలో)




## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు.. జూలై 1 నుంచి కొత్త ధరలు

సాధారణ పాస్‌పోర్ట్‌పై 1000 నుంచి 1500 వరకు పెంపు

తత్కాల్, మైనర్ల పాస్‌పోర్ట్ రుసుముల్లో కూడా గణనీయమైన మార్పులు

నిర్వహణ ఖర్చులు పెరగడమే కారణమన్న విదేశాంగ శాఖ

# సవాళ్ల మధ్య ఎస్ఐఆర్‌కు శ్రీకారం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం

ఇంటింటికీ చేరిన ఎన్యుమరేషన్ ఫారాలు.. బీఎల్‌వోల క్షేత్రస్థాయి బాధ్యతలు మొదలు

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని ఎన్నికల యంత్రాంగం స్పష్టం

గడువులోపు వివరాల నమోదు, ధ్రువీకరణపై దృష్టి.. ప్రక్రియపై రాజకీయ పార్టీల నిఘా..





## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్: పీయూష్

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

భారత్‌కు ప్రయోజనం ఉంటేనే ఒప్పందం

భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో ప్రాధాన్యం కోరుతున్న భారత్

50% సుంకాలను 18%కు తగ్గించే అంశంపై చర్చలు

ఇతర దేశాల కంటే భారత్‌కు మెరుగైన అవకాశాలు కావాలని డిమాండ్

# అనాథల సేవే సర్వస్వంగా... కృష్ణ గోపాల్ సేవాసమితి సేవలు

### అనాథల ఆకలి తీర్చడం

### మానవత్వానికి ప్రతీక.! డా. కపిల్ కుమార్ అగర్వాల్



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో మానవసేవే... మాధవ సేవ" అని అర్థానికి సాక్ష్యంగా కృష్ణ గోపాల్ సేవాసమితి నిరంతరం వృద్ధాశ్రమాలలో అనాథ వృద్ధులకు, అనాథ పాఠశాలల్లో అనాథ విద్యార్థులకు నిత్యం వాళ్ళ ఆకలి తీర్చడమే లక్ష్యంగా అల్పాహారాన్ని అందిస్తూ.! అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతూ అనాథల ఆకలి తీరుస్తూ వారి ముఖాల్లో చిరునవ్వులు చూసి "మానవసేవే.. మాధవసేవ" అని బలంగా నమ్మిన కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, ఈరోజు పవిత్ర నిర్జల ఏకాదశి సందర్భంగా డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ ఆదేశానుసారం అనాథ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధికారులు, సభ్యులు పాల్గొన్నారు



## బల్గూరి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి -మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ బ్రిక్స్ వ్యాపారవేత్త బల్గూరి వెంకటేష్ సాగర్ -మంగమ్మ దంపతుల కుమారుడు అనిల్ కుమార్ సాగర్- మమత వివాహ మహోత్సవం జైహింద్ ఫంక్షన్ హాల్ లో వారి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి, అరుణ్ సాగర్, మాజీ సర్పంచులు, నారాయణపురం మండల కాంగ్రెస్ నాయకులు, బంధుమిత్రులు తదితరులు హాజరయ్యారు.

# నదుల అనుసంధానంతోనే ప్రగతి

వన్ నేషన్ - వన్ గ్రిడ్ లాగే గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ కేవలం ఒక టెక్నికల్ విజయం మాత్రమే కాదని, మూడు రాష్ట్రాల కరువు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన కీలక అడుగని అభివర్ణించారు. ఏపీలోని కర్నూలు, అనంతపురం , తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రజల వలసల బాధలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల పంచాయతీలు పక్కనబెట్టి, కేవలం రైతుల శ్రేయస్సు కోసమే సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు చట్టబద్ధంగా రావలసిన 10 టీఎంసీల నీరు ఇంకా రావడం లేదని ప్రస్తావిస్తూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు సహకరించాలని కోరారు. వివాదాలు వీడి పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే అంతిమంగా రైతులకు మేలు జరుగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్యామ్ నిర్మించిన 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా పాత గేట్ల స్థానంలో హై-గ్రేడ్ స్టీల్ గేట్లను అమర్చామని తెలిపారు. గతేడాది ప్రమాదం జరిగినప్పుడు కేవలం పాత గేటుకు ప్యాచ్ వర్క్ చేయకుండా, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 గేట్లను మార్చేలా అంతరాష్ట్ర సమన్వయంతో బోర్డు నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే సీజన్‌లో పూర్తి స్థాయిలో 105 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం సురక్షితంగా సిద్ధమైందన్నారు. కర్ణాటకలో 9 లక్షల ఎకరాలు, ఏపీలో 6 లక్షల ఎకరాలు, తెలంగాణలో 87 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సుస్థిరమైన సాగునీరు అందుతుందని, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పూడికతీత అంశాలపై కూడా మూడు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం శుభపరిణామమని వారు



పేర్కొన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ జల వనరుల నిర్వహణలోను, అంతరాష్ట్ర సమస్యల పరిష్కారంలోనూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు చూపిన చొరవ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యూపీ-ఎంపీల మధ్య 'కెన్-బెత్వా' ప్రాజెక్ట్ తరహాలోనే దక్షిణాదిలోనూ గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాష్ట్రాల రైతుల నీటి హక్కులను కాపాడుతూ, తాగునీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలకు పూర్తి సాంకేతిక, ఆర్థిక మద్దతును అందిస్తుందని భరోసా ఇచ్చారు.

## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకుఅంకురార్పణ.. ఈసారి 69 అడుగుల రూపం!




ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం గణేశ్ మండపం వద్ద శాస్త్రోక్తంగా కర్ర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో విగ్రహ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. 72వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ ఉత్సవాల సందర్భంగా.. ఈ ఏడాది ఏర్పాటు చేయనున్న విగ్రహ నమూనా పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సంవత్సరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ స్వామివారు 'శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి' అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పూర్తి పర్యావరణహితంగా మట్టితో 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో ఈ భారీ విగ్రహాన్ని తీర్చిదిద్దనున్నారు. ఐదు పడగల ఆదిశేషుని నీడలో, ఎనిమిది చేతులతో పద్మాసనంపై ఆసీనుడై ఉండేలా విగ్రహాన్ని రూపొందిస్తారు. స్వామివారి ఐదు ముఖాలు పంచభూతాలకు ప్రతీకగా నిలవనున్నాయి. ఈసారి విగ్రహానికి ఇరువైపులా ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేస్తున్నారు. కుడివైపు 20 అడుగుల ఎత్తులో ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం నమూనా, ఎడమవైపు అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన కాళికామాత రూపం కొలువుదీరనున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి ఉండటంతో వచ్చే 82 రోజుల్లో విగ్రహ నిర్మాణం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన 100 మందికి పైగా కళాకారులు ఈ పనుల్లో పాల్గొంటారు. 1954లో అడుగు ఎత్తుతో ప్రారంభమైన ఖైరతాబాద్ గణపతి ప్రస్థానం ఈ స్థాయికి చేరడం విశేషమని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా బైరాన్ పల్లి లో ఫ్రీ ప్రైమరీ

### ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ కుమారస్వామి అధ్యక్షతన ఫ్రీ ప్రైమరీ తరగతి ప్రారంభోత్సవం

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా బైరాన్ పల్లి ప్రాథమిక పాఠశాల లో ఫ్రీ ప్రైమరీ మంజూరు చేశారు. ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ కుమారస్వామి అధ్యక్షతన గ్రామ సర్పంచ్ కల్లేబోయిన సురేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రవికుమార్, గ్రామ ఉపసర్పంచ్ కల్లబోయిన శ్రీకాంత్, గూడెంపాడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ బండి రజనీకర్, అమ్మో ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కల్లబోయిన మమత, వార్డు సభ్యురాలు ప్రవళిక పాఠశాల ఉపాధ్యాయ బృందం సంపత్, తిరుపతిరెడ్డి, సి ఆర్ పి నాగరాజు, హేమలత, అర్చన ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు





### విజయ సంకల్ప యాత్రను

## విజయవంతం చేయాలి

### ::: మోతె శోభన్ రెడ్డికి ఉద్యమకారుల ఆహ్వానం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25: ఈ నెల 29న నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ సభ్యుడు మోతె శోభన్ రెడ్డిని తార్నాకలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు. మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చేరవేసే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విజయ సంకల్ప యాత్రకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం నాయకులు, సభ్యులు, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు**

**భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటేనే ఒప్పందం**

**భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో ప్రాధాన్యం కోరుతున్న భారత్**

**50% సుంకాలను 18%కు తగ్గించే అంశంపై చర్చలు**

**ఇతర దేశాల కంటే భారత్‌కు మెరుగైన అవకాశాలు కావాలని డిమాండ్**

అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు. భారత్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.



## బదిలీపై వెళ్లిన ఎస్సై నాగలక్ష్మికి ఘన వీడ్కోలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25 : సికింద్రాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన నాగలక్ష్మి ఇటీవల బదిలీపై షీ టీమ్స్‌కు వెళ్లడంతో ఆమెకు పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో నాగలక్ష్మి సేవలను సహచర అధికారులు, సిబ్బంది కొనియాడారు. విధి నిర్వహణలో ఆమె చూపిన నిబద్ధత, ప్రజలకు అందించిన సేవలు, మహిళా సమస్యల పరిష్కారంలో ఆమె చేసిన కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి, పోలీస్ స్టేషన్ అభివృద్ధి, ప్రజలతో సత్సంబంధాల ఏర్పాటులో నాగలక్ష్మి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. షీ టీమ్స్‌లో కూడా ఆమె సమర్థవంతంగా విధులు నిర్వహించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నాగలక్ష్మిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఆదర్శంగా నిలిచిన ఉప్పుమడుగు సర్పంచ్, ఉపసర్పంచ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయికల్ మండల విద్యాశాఖ అధికారి (ఎం.ఈ.ఓ) శ్రీపతి రాఘవులు హాజరై పాఠశాల వసతులు, విద్యార్థుల నమోదు పరిస్థితిని పరిశీలించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కొత్తకొండ రోజా నవీన్, ఉపసర్పంచ్ అల్లేపు గంగాధర్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని చాటుతూ గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఏఏపిసి చైర్‌పర్సన్, రాయికల్ ఎం.ఈ.ఓ శ్రీపతి రాఘవులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా గొల్ల రాయలింగు, ఉపాధ్యక్షులు గొల్ల మధు, కార్యదర్శి గా నాంపల్లి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. మా పైన నమ్మకం తో బాధ్యతలు ఇచ్చినందుకు కుల సంఘ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదం మల్లేష్, అమ్ముల రాజు, తిరుపతి, మహేష్, మల్లయ్య, నాగన్న, రాజు, రాజకుమార్, లచ్చన్న యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు ..



## చింతల సుభద్రమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 25

చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ స్వర్గీయ చింతల కృష్ణారెడ్డి సతీమణి చింతల సుభద్రమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. చౌటుప్పల్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ వార్డు సభ్యుడు చింతల వెంకట్‌రెడ్డి (రాజు)తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా స్వర్గీయ చింతల కృష్ణారెడ్డి నీతి, నిజాయితీలతో ప్రజాసేవ చేశారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి చౌటుప్పల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మంచి పేరు,గౌరవం ఉందన్నారు. చింతల సుభద్రమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని అని అన్నారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపాలిటీ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, ఒకటో వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పబ్బు రాజు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు బాలు మహేందర్, నల్ల నరేందర్ రెడ్డి, చింతల రవీందర్ రెడ్డి, జానీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పట్టణంలోని న్యూ హోప్ అసోసియేషన్ జిల్లా డి- అడిక్షన్ సెంటర్ సందర్శన

### మత్తు పదార్థాల నిర్మూలనకు యాదాద్రి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది- జిల్లా ఎస్ పి






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ భువనగిరి పట్టణంలోని న్యూ హోప్ అసోసియేషన్ జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ ( డి డి ఏ సి) ను సందర్శించారు.పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న వ్యక్తులతో ముఖాముఖి మాట్లాడి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.చెడు అలవాట్లను పూర్తిగా విడిచిపెట్టి, పునరావాస అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు.మత్తు పదార్థాలకు ఎలా బానిసలయ్యారు, వాటిని ఎక్కడి నుండి కొనుగోలు చేశారనే అంశాలపై వారితో చర్చించారు, వారి కుటుంబాల పరిస్థితి గురించి ఆరా తీసి, మత్తు వ్యసనం కుటుంబాలపై చూపే ప్రభావాన్ని వివరించారు.క్రీడలు, ఆటలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, విద్య మరియు ఉపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు.క్రమశిక్షణ, సానుకూల ఆలోచనలు మరియు ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ప్రేరేపించారు.సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపడానికి పోలీసు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మత్తు పదార్థాల నిర్మూలనకు యాదాద్రి భువనగిరి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమం లో భువనగిరి సీఐలు రమేష్ ,చంద్రబాబు మరియు ఎస్ఐలు అనిల్ కుమార్, నరేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## శివ భక్త మార్కండేయ స్వామి ఆలయం లో అన్నప్రాసద వితరణ






వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, జ్ఞాన సరస్వతి మాత దేవాలయంలో ద్వాదశ (12) వార్షికోత్సవ జాతర సందర్భంగా గురువారశీ రోజున ఉదయం11:30 గంటలకు మహా అన్నప్రసాధ వితరణ కార్యక్రమం, జాతర ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిష్టంపేట, పరిసర గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివ భక్త మార్కండేయ స్వామి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, జ్ఞాన సరస్వతి మాత దేవాలయంలో ద్వాదశ (12) వార్షికోత్సవ జాతర నిర్వహించబడుతుందని అదే మాదిరిగా ఈ సంవత్సరం లో కూడా నిర్వహించామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు, పుష్పార్చనలు ప్రత్యేక పూజలు చేపట్టడం జరిగిందని, భక్తి భావనతో భజన సంకీర్తనలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.

## రాయికల్ లో ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25

భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ఆధ్వర్యంలో ఓటరు జాబితా ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం లో భాగంగా గురు వారం రోజు రాయికల్ పట్టణంలో నీ 28, 32, 36,37, పోలింగ్ బూత్ ల లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పౌరులు తమ ఓటరు వివరాలను నమోదు చేసుకోవడం, సవరించడం, తొలగించడం ధ్రువీకరించుకోవడం చేయవచ్చు..ఈ కార్యక్రమంలో ఆర్ఐ పద్మయ్య, కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి, పుర్రె శ్రీధర్, బిఎల్ఏ లు కట్ల నర్సయ్య, 12వ వార్డు, 5వ వార్డు జక్కుల రవి, ఏ డబ్ల్యూ డి, బి .ఎల్. వో లు బైరి వనిత, ఎలిగేటి రజిత, సంపతి రాజేశ్వరి, రిజ్వానా బేగం, ఆర్ పి లావణ్య, ఆర్పి ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ పేరుతో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి: సుక్క గణేశ్ ముదిరాజ్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25 :

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమం లాలాపేట్‌లో ఘనంగా జరిగింది. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇంద్రానగర్ సత్యనగర్ శివాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుక్క గణేశ్ ముదిరాజ్ నాయకత్వం వహించారు. వెనుకబడిన వర్గాల మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా సుక్క గణేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, వెనుకబడిన వర్గాల మోర్చా పదాధికారులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఇంటింటికి వెళ్లి ఎనిమిరేషన్ ఫారమును పంపిణీ చేయాలి..తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి

వార్త మిర్రర్ సంస్థాన్ నారాయణపురం, ప్రతినిధి జూన్ 25 :- భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి అనర్హులు జాబితాలలో లేకుండా ఉండేందుకు జూన్ 25 నుండి స్పెషల్ ఎంటెన్సీ వ్ రివిజన్ నిర్వహిస్తుంది. ఎలిమినేషన్ ఫారంలో ఈ వివరాలను తెలియజేయడానికి గురువారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం వద్ద బూత్ నెంబర్ 107 లో బిఎల్వోలు బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎనిమిరేషన్ ఫారమును పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి విచ్చేసి భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓటర్ జాబితాను పగడ్బందీగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేయుచున్నది. దీనికి ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని . పటిష్టమైన ఓటర్ల జాబితాకు ప్రజలందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ ధరణి మంజుల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందు గుల బాలకృష్ణ పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ కాంగ్రెస్ నాయకులు భూపని బలరాములు మహేశ్వరం స్వామి మందు గుల గంగయ్య ఈసం శివకుమార్ గంగపుత్ర సంఘం పెద్దలు రాస మల్ల పెంటయ్య. పబ్బు మారయ్య చేర్క వెంకటయ్య. రాస మల్ల రమేష్ వేంపాటి నరసింహ దీటి నరసింహ మెట్టు నరసింహ గుండమల్ల లింగస్వామి



గుండ మల్ల రమేష్ గుండమల్ల అంజయ్య గుండమల్ల హరీష్ రాస మల్ల అంజమ్మ రాస మల్ల సరస్వతి భూపని సత్తమ్మ మహేశ్వరం వసంత మందు గుల సత్యలక్ష్మి రాస నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ తెలుగు దినపత్రికల్లో ప్రచురించే శైలిలో, ఆంగ్ల పదాలను వీలైనంత వరకు నివారిస్తూ ఇలా ఇవ్వవచ్చు:



## బదిలీపై వెళ్లిన ఎస్సై నాగలక్ష్మికి ఘన వీడ్కోలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25 : సికింద్రాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన నాగలక్ష్మి ఇటీవల బదిలీపై షీ టీమ్స్‌కు వెళ్లడంతో ఆమెకు పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో నాగలక్ష్మి సేవలను సహచర అధికారులు, సిబ్బంది కొనియాడారు. విధి నిర్వహణలో ఆమె చూపిన నిబద్ధత, ప్రజలకు అందించిన సేవలు, మహిళా సమస్యల పరిష్కారంలో ఆమె చేసిన కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరి, పోలీస్ స్టేషన్ అభివృద్ధి, ప్రజలతో సత్సంబంధాల ఏర్పాటులో నాగలక్ష్మి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. షీ టీమ్స్‌లో కూడా ఆమె సమర్థవంతంగా విధులు నిర్వహించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నాగలక్ష్మిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## లక్ష్మీపూర్ లో యెస్.ఐ.ఆర్. ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో యెస్.ఐ.ఆర్ కార్యక్రమంలో లో భాగంగా బి.ఎల్.ఓ లు స్వప్న, తిరుమల, గ్రామంలో యెస్. ఐ.ఆర్ పై అవగాహన కల్పించారు, ఇట్టి కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ జీవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాదరి నిమిత్ కి జన్మదిన శుభాకాంక్షలు



వార్త మిర్రర్ సంస్థాన్ నారాయణపురం, ప్రతినిధి జూన్ 25 :-సంస్థాన్ నారాయణపురం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ తనయుడు గాదరి నిమిత్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు సంస్థాన్ నారాయణపురం శ్రీ కంఠమహేశ్వర దేవస్థానం మాజీ అధ్యక్షులు రాపర్తి కరుణాకర్ గౌడ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమిత్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు,అభిమానులు,తదితరులు,పాల్గొన్నా



## జగిత్యాల జిల్లా ఖజానాధికారికి భగవద్గీత ప్రదానం...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 25 జగిత్యాల జిల్లా ఖజానాధికారిగా (డిటివో) ఇటీవల పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఎస్. పద్మ కు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్.యు.పి.పి.టి.ఎస్) జగిత్యాల జిల్లా శాఖ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రాజేంద్ర ప్రసాద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ పాల్గొని పద్మ కు శుభాకాంక్షలు తెలియజేసి భగవద్గీతను అందజేశారు. అలాగే ఉత్తమ సేవలు అందిస్తున్న యస్.టి.వో మానుక సత్యనారాయణ యాదవ్, సినియర్ అసిస్టెంట్ శరత్‌లను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులు అలకట్టు సత్యనారాయణ, అప్పాల గంగయ్య యాదవ్, పూర్ణచందర్, వేల్పుల రఘు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు : సిఐ జి. మన్మధ కుమార్





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 25

విద్యార్థులు మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం ప్రభుత్వ విద్యాసంస్థలో గురువారం విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని, సోషల్ మీడియా ప్రలోభాలకు లోనుకాకుండా చదువు, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, ప్రలోభపెట్టినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి మద్దతుగా విద్యార్థులతో 'మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ' చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు..

## ఆర్టీసీ విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి: సంపత్ ముదిరాజ్ ఆమరణ నిరాహార దీక్ష



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను సంపూర్ణ ఉద్యోగ భద్రతతో ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, విలీన అమలు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష మండలి అధినేత సీహెచ్ సంపత్ ముదిరాజ్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ బహుజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో, శాసన మండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో ఈ ఉద్యమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా సంపత్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రోడ్డు రవాణా సంస్థ కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడితే ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం అవుతామనే ఆశతో కార్మికులు సమ్మెలు, ఉద్యమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 52 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 34 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, అయినప్పటికీ కార్మికుల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరువాత జరిగిన ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు.ఇటీవల జరిగిన మూడు రోజుల సమ్మె సందర్భంగా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మాహుతికి పాల్పడిన అనంతరం ప్రభుత్వం చర్చలకు పిలిచినా, విలీనంపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం కార్మికుల్లో నిరాశను మరింత పెంచిందన్నారు. కార్మికులు కోరుకుంటున్నది ఒక్కటేనని, సంపూర్ణ ఉద్యోగ భద్రతతో ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. అయితే ముందుగా కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత విలీన ప్రక్రియ చేపడతామని ప్రభుత్వం ప్రకటించడం కార్మికులను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. అలాగే 2017 సంవత్సరం నుంచి పదవీ విరమణ పొందిన దాదాపు 17 వేల మంది కార్మికులకు రావలసిన పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పటికీ అందలేదని తెలిపారు. బకాయిలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటూ 357 మంది విశ్రాంత కార్మికులు మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. వారికి రావలసిన అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే తన వైఖరిని స్పష్టం చేసి, రోడ్డు రవాణా సంస్థ విలీన అమలు తేదీని ప్రకటించాలని, అలాగే కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షను చర్చల ద్వారా విరమింపజేయాలని బహుజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కోరింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ సాజిద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, అదనపు కార్యదర్శి గౌడ రవికిరణ్, కార్యదర్శి డి. రామచంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ. శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## 17వ వార్డులో 160 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

### ఎమ్మెల్యే, చైర్మన్ సహకారంతో సమస్యకు మోక్షం: కౌన్సిలర్ ఉమామహేశ్వరి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 25

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో దీర్ఘకాలంగా వేధిస్తున్న లో-వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డులోని విద్యుత్ సమస్యలపై స్థానిక కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి-సాయిలు ట్రాన్స్‌కో ఏఈ కి ఫిర్యాదు చేయడంతో అధికారులు తక్షణమే స్పందించారు.గతంలో ఉన్న 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి,దాని స్థానంలో నూతనంగా 160 హెచ్‌పీ సామర్థ్యం గల భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేశారు.?ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి-సాయిలు మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సహకారం, మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని-రమేష్ గౌడ్ సూచనలతోనే ఈ సమస్య పరిష్కారమైందని తెలిపారు. తమ వార్డు ప్రజల ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన ట్రాన్స్‌కో ఏఈకి, సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.వార్డులో ఉన్న అన్ని ప్రజా సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతాం. 17వ వార్డు పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు. వాటిని తప్పకుండా పరిష్కరిస్తాం. అని కౌన్సిలర్ హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాదాని గోపాల్, సైదులు, ట్రాన్స్‌కో సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో అక్రమాల పై ఉన్నతస్థాయి విచారణ జరపాలి: ఏఐఎస్ఎఫ్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25: ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల రూపకల్పన సదస్సుల నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల రూపకల్పన సదస్సుల నిర్వహణలో తీవ్ర అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కృష్ణంరాజు పర్యవేక్షణలో ఉన్న ఒక పరిశోధక విద్యార్థికి రూపకల్పన సదస్సు నిర్వహించకుండానే పూర్వ తేదీతో నివేదిక జారీ చేసినట్లు ఆరోపించారు. ఈ ప్రక్రియలో సంబంధిత అధికారులు, అధ్యాపకుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రూపకల్పన సదస్సులు పూర్తి చేయని లేదా నివేదికలు సమర్పించని సుమారు 80 మంది పరిశోధక విద్యార్థులను తదుపరి విద్యా ప్రక్రియలకు అనుమతించకపోయినా, ఒక విద్యార్థికి ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ అంశంపై విశ్వవిద్యాలయ ఉపకులపతి వెంటనే జోక్యం చేసుకుని నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరారు.ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా విశ్వవిద్యాలయ కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంపై వస్తున్న ఆరోపణలు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారాలను దుర్వినియోగం చేయడం విచారకరమని పేర్కొన్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమా లను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి అశ్వన్ కుమార్, ఉపాధ్యక్షుడు దొండి రామ్, నాయకులు సుమన్, మధు తదితరులు పాల్గొన్నారు.




## సర్ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లకు అవగాహన





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 25: ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వరనగర్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ అలకుంట సరస్వతి, సామాజిక కార్యకర్త అలకుంట హరి ఇంటింటికీ తిరిగి ఓటర్లకు అవగాహన కల్పించారు. గురువారం ప్రారంభమైన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా వారు బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి ప్రజలను కలుసుకుని ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, పేర్ల సవరణ తదితర అంశాలపై వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఓటరు జాబితాలో సరైన వివరాలు ఉండటం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాలకిషన్ గౌడ్, కుంచపు జగన్, వేముల నాగరాజు, ఓర్సు శేఖర్, ఎండీ అజ్జు ఫయాక్, ఓర్సు అంజి, బోదాసు రాంచరణ్, రూపాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అలకుంట హరి, మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ యువజన విభాగం, గ్రేటర్ హైదరాబాద్, తార్నాక డివిజన్ పాల్గొని ఓటర్లతో మమేకమయ్యారు.